క్లుప్తంగా

కలెక్టర్‌ను కలసిన జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి



కలెక్టర్‌కు పూల మొక్కను అందజేస్తున్న విజయశేఖర్

రాయచోటి : అన్నమయ్య జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా నియమితులైన విజయశేఖర్ కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. బుధవారం కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన తరువాత జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, లిక్కర్, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. అక్రమాలకు పాల్పడితే వారు ఎంతటివారైనా సరే సహించేది లేదని హెచ్చరించారు.

డీలర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



అధ్యక్షుడిని అభినందిస్తున్న డీలర్లు

రైల్వేకోడూరు అర్బన్ : మండల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిని బుధవారం స్థానిక నిల్వ కేంద్రం వద్ద డీలర్లు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేష్, కోశాధికారిగా సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడిగా రాజామాణిక్యంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌక దుకాణం డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు డీలర్లు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు తగవు

రాయచోటి అర్బన్ : సీపీఐ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న సీపీఐ నేతలను పోలీసులు ముందస్తు అరెస్ట్‌లు చేయడం తగదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్ళనిర్మాణానికి కేటాయించే మొత్తాన్ని రూ.1.8 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలన్న డిమాండ్‌తో 2వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహింప తలపెట్టామన్నారు. కాగా కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు రైల్వేకోడూరు, రాజంపేట, మదనపల్లె ప్రాంతాలకు చెందిన సీపీఐ నేతలను అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌లలో అక్రమంగా నిర్బంధించడం తగదన్నారు. అరెస్టులతో ప్రశ్నించే గొంతుకలను అణచివేయజాలరంటూ చెప్పారు.

ఆరోగ్యశ్రీ కంటి వైద్య పరీక్షలు

రాయచోటి టౌన్ : ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఈ నెల 3వ తేదీన రాయచోటి అర్చన విద్యాసంస్థలో (ఎగువ అబ్బవరం) కంటి పరీక్షల క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల కరస్పాండెంట్ మదన్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరానికి డాక్టర్ స్వరూప రాణి, డాక్టర్ రవితేజ రెడ్డి, రెటీనా స్పెషలిస్టు డాక్టర్ హారికా రెడ్డి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు, శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా కుట్లు లేకుండా ఆపరేషన్లు చేయనున్నట్టు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ

చిన్నమండెం : రాయచోటి- బెంగళూరు ప్రధాన రహదారిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఎస్‌ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ తమ పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాధితురాలికి చెక్కును అందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు : పట్టణంలోని ధర్మాపురానికి చెందిన తాడి జయమ్మ కుటుంబానికి బుధవారం రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సీఎం సహాయనిధి కింద లక్ష రుపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. పేద ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ ఉపయోగకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, వెంకటరెడ్డి, పట్టణ కన్వీనర్ సీహెచ్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ పండ్లు.. లాభాలు మెండు



విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల పండ్లు



పుచ్చకాయలు విక్రయిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : మార్చి మొదటిలోనే భానుడి వేడి మొదలైంది. ప్రజలు వేసవి తాపాన్ని తాళలేకపోతున్నారు. వేసవిలో లభించే సీజనల్ ఫ్రూట్స్‌ను తీసుకుంటున్నారు. దీంతో పుచ్చకాయ, దోస, ద్రాక్ష, చీని, దానిమ్మ, సపోట, ఇలా రకరకాల పండ్లకు గిరాకి పెరిగింది. రైల్వేకోడూరు పట్టణంలో పండ్ల బండ్లు రోడ్లపై విరివిగా కనిపిస్తున్నాయి. విక్రయదారులకు రోజుకు 5 నుంచి 10 వేల రూపాయల వరకు వ్యాపారం జరుగుతోంది. మజ్జిగ, జ్యూస్‌ల వ్యాపారాలు కూడా పుంజుకున్నాయి. వేసవిలో పండ్ల విక్రయాలు, జ్యూస్‌లపై ఆధారపడేవారి సంఖ్య అధికంగానే ఉంది. ముఖ్యంగా పుచ్చకాయ సీజన్ ఫిబ్రవరి, మార్చ్, ఏప్రిల్, మే నెలంతా సాగుతుంది. ఈ ప్రాంత పుచ్చకాయ మార్కెట్‌లోకి వచ్చే వరకు వ్యాపారస్తులు అధిక ధరలకు విక్రయిస్తారు.

కర్బూజ కాయలకు గిరాకీ ఉంది



ప్రతి వేసవి సీజన్‌లో ఇక్కడ కర్బూజ కాయలకు డిమాండ్ బాగా ఉంటుంది. కాయలను చుట్టు పక్క గ్రామాల నుంచి ప్రస్తుతం దిగుమతి చేసుకోంటున్నాం. ప్రతి రోజూ 5000 రూపాయలు వ్యాపారం జరుగుతుంది.

– దమ్ము రఘు, ఉర్లగడ్డపోడు, రైల్వేకోడూరు

ఆశించినంత లాభాలు లేవు



కర్బూజ పంటను రెండు ఎకరాలలో పండించాను. ఈ ఏడాది దిగుబడి, ఆదాయం ఆశించినంత లేదు. సరైన సమయంలో పంట చేతికి వచ్చినా ఆదాయం రావడంలేదు. స్థానికంగా కూడా మార్కెట్ ఉంది. రెండవ కోత ఇక్కడే అమ్ముకోవచ్చు.– అనీల్‌కుమారెడ్డి, రైతు, రైల్వేకోడూరు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



బస్సులను ప్రారంభిస్తున్న ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సురక్షితమని, ప్రయాణీకులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం రాజంపేట– నెల్లూరు మధ్య నడవనున్న కొత్త అద్దె బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులను సకాలంలో సురక్షితంగా ప్రయాణీకులను గమ్యానికి చేరుస్తాయన్నారు. డీఎం రమణయ్య మాట్లాడుతూ డిపో పరిధిలో ప్రజలకు అవసరమైన సర్వీసులను గుర్తించి ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా ఆర్టీసీ లాభాల బాటలో పయనించేలా కార్మికులు, అధికారులు కలిసికట్టుగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇటీవల రాజంపేట– రాయచోటి మార్గంలో అల్ట్రా పల్లె వెలుగును ప్రారంభించామన్నారు. ప్రయాణీకులను ఆర్టీసీ బస్సు సర్వీసులను ఆదరించి, ఆర్టీసీ అభివృద్ధికి దోహదపడాలన్నారు. ప్రయాణీకులే ఆర్టీసీకి దేవుళ్లని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజరు కృష్ణమూర్తి, మజ్దూర్ యూనియన్ జోనల్ నేత మోడపోతుల రమణ, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

సిద్దవటం : పంచలింగాల స్వామి ఆలయ ఆవరణలో ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను బుధవారం తొలగించామని ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి నిత్యపూజ స్వామిని దర్శించుకున్న భక్తులకు పంచలింగాల వద్ద దాతలు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారన్నారు. అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులను దృష్టిలో ఉంచుకొని అక్కడ భక్తులు పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, విస్తర్లు, వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లను తదితర వ్యర్థ పదార్థాలను అటవీశాఖ అధికారులు పర్యవేక్షణలో ప్రధాన రహదారిలో, వాగులు, వంకల్లో, కోనేరు వద్ద కూలీలతో తొలగించి శుభ్రంగా చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొండారెడ్డి, ఆలయ ఉద్యోగి చంద్ర, అటవీశాఖ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

పారదర్శకంగా భవన నిర్మాణ అనుమతులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ నందన్

రాజంపేట : అన్నమయ్య డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో చేపట్టబోయే భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్న అనడా వైస్‌చైర్మన్ నందన్ అన్నారు. బుధవారం అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో రాజంపేట రెవెన్యూ డివిజన్ సంబంధిత పంచాయతీ కార్యదర్శులతో పంచాయతీలలో ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్ అనుమతి ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో 300 చదరపు మీటర్ల కంటే తక్కువ వైశాల్యం ఉన్న బిల్డింగ్ ప్లాన్ అనుమతి ప్రక్రియకు సంబంధించి ఎంట్రో లాబ్స్ వారిచే వెబ్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ అప్లికేషన్‌పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. సమావేశంలో డీఎల్‌పీఓ నాగరాజు, ప్లానింగ్ ఆఫీసర్ శైలజ, ఏపీఓ ఆసీఫ్, కృష్ణసింగ్‌లతోపాటు డీఎల్‌పీఓ, ఎంపీడీఓలు, ఈఓలు తదితరులున్నారు.

నల్లగంగమ్మ సన్నిధిలో ఇరిగేషన్ ఎస్‌ఈ



నల్లగంగమ్మ సన్నిధిలో ఎస్‌ఈ క్రిష్ణమూర్తి

సంబేపల్లె : జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దేవరరాయి నల్లగంగమ్మను ఇరిగేషన్ ఎస్‌ఈ క్రిష్ణమూర్తి, ఐసిఐసి ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై ఆరాతీశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వచ్చే భక్తులకు మరుగుదొడ్లు నిర్మించాలని ఐసిఐసి ఫౌండేషన్ ప్రతినిధులు దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఐసిఐసి ఫౌండేషన్ సంస్థవారు మరుగుదొడ్లు నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బి.కొత్తకోట : జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణాల పూర్తికి లక్ష్యాలు సాధించకుంటే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శంకరయ్య అన్నారు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఉగాదికి ఇళ్ల నిర్మాణాల ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. మిషన్ అంత్యోదయ సర్వే వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జాతీయస్థాయిలో మెరిసిన ప్రభుత్వ విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఎంఈఓ

రైల్వేకోడూరు అర్బన్ : ఫిబ్రవరి నెల 25, 26 తేదీలలో కర్నూలు పట్టణంలో జరిగిన జాతీయ వాకో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీలలో మండల పరిషత్ పాఠశాల, క్యాంపస్‌లకు చెందిన రెండవ తరగతి విద్యార్థులు సాయికీర్తన గ్రీన్ బెల్ట్, సాయి చైతన్య ఎల్లో బెల్ట్ సాధించినట్లు ఎంఈఓ రామయ్య బుధవారం తెలిపారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులను, తల్లిదండ్రులు, కోచ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ తోటి విద్యార్థులకు ఆదర్శప్రాయంగా చిన్న వయసులో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ప్రతిభ కనబరచడం సంతోషమన్నారు.

ఆలయానికి స్థలం కేటాయించండి



తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని జ్యోతి గొల్లపల్లె గ్రామంలో రామాలయం నిర్మాణానికి స్థలం కేటాయింపులో సమస్య లేకుండా పరిష్కరించాలని గ్రామస్తులు బుధవారం తహసీల్దారు శంకర్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో రామాలయ నిర్మాణానికి స్థలం విషయమై పలుమార్లు అధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అంతేగాకుండా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. తహసీల్దారు మా సమస్యను పరిష్కరించాలని వారు వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం పోరాడిన అమరులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతూ అమరులైన మాదిగ సోదరులకు పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర నాయకుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎందరో ప్రాణత్యాగాలు చేశారని తెలిపారు. వారిని ఆదర్శంగా చేసుకొని ప్రతి ఒక్కరం వర్గీకరణ సాధనకు పోరాటాలు చేయాలన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

చిట్వేలి : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని చిట్వేలి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద నాగేశ్వర మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రం ప్రాంగణంలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 28 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ పోరాడుతున్నా ఇంతవరకు చట్టబద్ధత కల్పించకపోవడం అన్యాయమన్నారు. అమరవీరుల త్యాగాలను మాదిగ జాతి మరచిపోదని, మీ త్యాగాల సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు మంద విశ్వనాథం, నగిరిపాటి యానాదయ్య, మందా సుధాకర్, వి శ్రీనివాసులు, టి కొండయ్య, కృష్ణయ్య, చిన్న కనకయ్య, కిరణ్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

ములకలచెరువు : అక్రమంగా తరలిస్తున్న నాటుసారా స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక బుధవారం తెలిపారు. సీఐ కథనం మేరకు... సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం గుడిసాని చెరువు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక బొలేరో వాహనం నిలపకుండా వేగంగా వెళ్లిపోయిందన్నారు. సిబ్బంది వాహనంతో వెంబడించి పట్టుకొని బొలేరో వాహనాన్ని తనిఖీ చేయడంతో అందులో 50 లీటర్ల నాటుసారా ఉన్నట్లు గుర్తించారు. పెద్దమండ్యం మండలం రామానాయక్ తండాకు చెందిన డ్రైవర్ క్రిష్టా నాయక్‌ను అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఎస్‌ఐ వై.బాబు, సిబ్బంది లింగమూర్తి, రమణ, మణికుమార్, హరిప్రసాద్ ఉన్నారు.

బోడి గుట్టకు నిప్పు

పెద్దతిప్పసముద్రం : పీటీఎం సమీపంలోని బోడి గుట్టలో బుధవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఎవరో ఆకతాయిలు నిప్పు పెట్టడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో గుట్ట దిగువ భాగంలో ఉన్న మామిడి తోటకు మంటలు చుట్టుకోవడంతో రైతులు, ప్రజలు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు.

ఖాతాలను సరిచూసుకోండి

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని పోస్టాఫీసులో పొదుపు ఖాతాలు కలిగిన వారు తమ పాసు పుస్తాకాలను పోస్టాఫీసులలో సరిచూసుకోవాలని రాజంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.అమర్‌నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ పరిధిలోని ఓబులవారిపల్లె కార్యలయంలో ప్రతి నెల డబ్బులు చెల్లించే ఖాతాదారులు పాసుపుస్తకాలను పోస్టు మాస్టర్ వద్ద పరిశీలించుకోవాలన్నారు.

కాలుష్య గ్రామాలకు పునరావాసం కల్పించండి



ఇన్‌చార్జ్ సీపీఓ బెనర్జీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు, గ్రామస్తులు

ఓబులవారిపల్లె : కాలుష్య గ్రామాలైన మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాలను వెంటనే తరలించి పునరావాసం కల్పించాలని బెరైటీస్ ఆధారిత ప్రజా సంక్షేమ సంఘం, ఆయా గ్రామస్తులు బుధవారం ఇన్‌చార్జ్ సీపీఓ బెనర్జీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పులపత్తూరి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సహకరంతో మూడు గ్రామాల తరలింపునకు సహకరం అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తరలింపు ప్రక్రియను వేగవంతం చేసిన గ్రామాల ప్రజలకు పరిహారం, ఉద్యోగాలు పునరావాసం ఆలస్యమవుతోందన్నారు. తరలింపు ప్రక్రియలో రెవెన్యూ అధికారులు, ఏపీఎండీసీ అధికారులకు అన్ని విధాల గ్రామాల ప్రజలు సహకరం అందించాలన్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ చట్టం ప్రకారం పునరావాసం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు యానాదిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సుబ్బయ్య, పవన్, రమణ, కోటి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి

సిద్దవటం : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ అనేది తప్పనిసరి అని సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మధుశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన స్టాఫ్ నర్సులు తులసి, రామాంజులమ్మ, చిన్న స్థాయి ఉద్యోగులు చంద్ర, పెంచలమ్మ, చెన్నమ్మ వారి సేవలను గుర్తించి వారిని ఘనంగా సత్కరించామన్నారు. ఎక్కడికి బదిలీ అయిన ఉద్యోగులు తమ పనిని వంద శాతం నిబద్ధతతో చేయాలని తెలిపారు. ఆసుపత్రికి వీరు చేసిన సేవలు మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శశికుమార్, మహిళా వైద్యాధికారులు, నర్సులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూసకు మొదటి ప్రాధాన్యతా ఓటును వేయిద్దాం



రాయచోటి టౌన్: ఓటర్లకు మొదటి ప్రాధ్యానతివ్వాలని కోరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఓబులవారిపల్లె: వెన్నపూసకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఓబులవారిపల్లె : వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలింపించాలని బుధవారం బొమ్మవరం గ్రామంలో ఉప మండలధ్యక్షుడు జి. గౌరిశంకర్‌రాజు, భరత్‌కూమార్ రెడ్డి పట్టభద్రులను కోరారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ మద్దతుదారుడికి ఓటు వేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. భరత్ కూమర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీగా వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.గంగురాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో

నందలూరు(రాజంపేట) : రాష్ట్రంలో ఎటువంటి ఎన్నికైన వైఎస్సార్‌సీపీదే గెలుపు అని నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి ధీమాను వ్యక్తం చేశారు. నందలూరులోని ఓ ప్రైవేటు భవనంలో ఎమ్మెల్సీల ఎన్నికలను పురష్కరించుకొని పార్టీ కేడర్ సమాయత్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను సమష్టిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. జెడ్పీటీసీ గడికోట ఉషా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి రవీంద్రారెడ్డిని గెలిపించుకునేలా పట్టభద్రులను చైతన్యవంతులు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, మండల ఉపాధ్యక్షుడు భావనశ్రీధర్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నేత నడివీధి సుధాకర్, ఎంపీటీసీ సోమిశెట్టి సునీతాప్రభాకర్, పి.నాగసుబ్బయ్య, కాకిచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు పాటూరు మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ పి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేయాలని వెన్నపూస జయచంద్రారెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి గూటం రాము ఓటర్లను కోరారు. బుధవారం రాయచోటి పట్టణంలో ఓటర్లను కలసి మీ మొదటి ప్రాధాన్యతను వెన్నపూస రవీంద్రారెడ్డికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గాలికుంటు వ్యాధికి టీకాలే నివారణ



పశువులకు టీకాలు వేస్తున్న డీడీ అబ్దుల్

రాజంపేట రూరల్ : గాలికుంటు వ్యాధిని నివారించేందుకు 100శాతం టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ డీడీ(సహాయ సంచాలకులు) డాక్టర్ అబ్దుల్ ఆరీఫ్ తెలియజేశారు. మండలంలోని పెద్దకారంపల్లి పంచాయతీ ఉప్పరపల్లితో పాటు పట్టణంలోని పలు పశువులకు బుధవారం గాలికుంటు వ్యాధి టీకాలను పశువులకు వేశారు. ఈ సందర్భంగా డీడీ అబ్దుల్ ఆరీఫ్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు డివిజన్ పరిధిలో నేటి నుంచి మార్చి 31వ తేదీ వరకు పశువులకు టీకాలు అందించనున్నామన్నారు. ఇప్పటికే డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు 56,800 డోసులను సరఫరా చేసినట్టు తెలిపారు. ఈ రోజు 189 పశువులకు టీకాలు వేశామని చెప్పారు. టీకాలు వేయించకుంటే పశువులలో పాల దిగుబడి సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. టీకాలు వేయించని పశువులకు చూళ్లు నిలవడం కుదరదని తెలియజేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ కే ప్రతాప్, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య, అటెండర్ బి.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లిలో..

వీరబల్లి : పశువులకు ముందస్తుగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించి జాగ్రతలు పాటించాలని మట్లి సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి పేర్కొన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బుధవారం ఆయన ఆధ్వర్యంలో మండల పరిధిలోని మట్లి పెద్దురు కస్బా గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యులు జయప్రకాష్ వ్యాధి లక్షణాలు, వ్యాధి వల్ల కలిగే నష్టాలు గురించి పాడిరైతులకు వివరించారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి టీకాలు వేయించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏవైనా సలహాలు అవసరమైతే మండల పశువైద్య శాలలో సంప్రదించాలని పాడి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.నాగభూషణం నాయుడు, ఫీల్డ్ అసిస్టెంటు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : పాడి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం ప్రారంభించినట్లు డాక్టర్ జయప్రకాష్ తెలిపారు. ఉచిత వాక్సినేషన్ ప్రారంభంలో భాగంగా బుధవారం మట్లి గ్రామం నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఈ నెలాఖరు వరకు ఉంటుందన్నారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా మొదట ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ ఇస్తున్నట్లు తెలిపారు. వ్యాక్సినేషన్ పశువులకు వేయించుకొని తమ పశువులను సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకోవాలని సూచించారు.